
తే 15-6-80 ది నెల్లూరు టౌన్‌హాలులో జరిగిన

# ఆంధ్రప్రదేశ్
# కిసాన్ సమ్మేళన్" మహాసభ

## విశేషాలు, తీర్మానాలు



ప్రచురణ :

నెల్లూరుజిల్లా కిసాన్ సమ్మేళన్

# మా దొక మనవి

ఆకాశం ప్రతిధ్వనించవచ్చు, ఏనుగు లుపరిగెత్తవచ్చు, సింహములు గర్జించవచ్చు, సముద్రములు ఉప్పొంగవచ్చు, చివరకు ఉరుములు ఉరిమి పిడుగులవర్షం వర్షించవచ్చు, ఏమైతేనేమి భారతీయరక్తం నిస్సారమైనది. అందులో రైతాంగరక్తంలో వేడి తక్కువ.

అదేకాబోలు ఎందరెన్ని విధాల రైతులను ఉద్బోధిస్తున్నప్పటికీ చైతన్యము రాలేదు. గాఢనిద్రనుండి వారుమేల్కొనేస్థితిలోలేరు. చెపుతుంటే వినిపించుకోవడంలేదని, ఐక్యత అసలేలేదని, భారతదేశములో రైతులస్థానం ఏమిటో యింతవరకు వారు గుర్తించలేదని న్యాయమైన వారి సమస్యల పరిష్కార సాధనకైనా పోరాటం జరుపుటకు సంసిద్ధులు కాలేదని వారిపై అలుకబూని ఆదర్శాలను వదులుకొంటే మిగిలేదేమిటి?

ఎందరో భోగులు, త్యాగులుగా మారారు. విరాగులయ్యారు. తమ సర్వస్వము రైతోద్యమాలకే అర్పించారు. కొందరు చరిత్రకెక్కారు. మరికొందరు తెరమరుగైయ్యారు. ఇంకనూ కొందరు కొనఊపిరితో నడచీ నడవలేనిస్థితిలో తప్పటడుగులు వేసుకొంటూ, తమ అంతిమరోజులలోనైనా, ఆశయాలు నెరవేరగలవన్న సంకల్పముతో బ్రతుకుతున్నారు. కాలము కలసివచ్చి, ఏదో ఒకరోజు తమ భవిష్యత్తును తామే నిర్ణయించుకొనే శుభఘడియలు రైతాంగమునకు రాకపోతవా! అనుకొనే పెద్దల హితవులను పాటించి వ్యవధి తక్కువైనప్పటికీ 15-6-80 వ తేది ఆంధ్రప్రదేశ్ "కిసాన్ సమ్మేళన్" మహాసభ నెల్లూరులో జరపగలిగాము. హాలికుని ముల్లుకర్రే దేశాభ్యుదయమునకు ఆయుధం, కావాలన్నవారి సహాయంతో మహాసభ విజయవంతమైనది. సహకరించిన నాయకులకు, కార్యకర్తలకు, పెద్దలకు, ఇవే మా నమోవాకములు.

భవదీయ,

ధనెంకుల నరసింహం.

తే 15-6-80 ఆదివారం నెల్లూరు టౌన్ హాలులో జరిగిన

ఆంధ్రప్రదేశ్ కిసాన్ సమ్మేళన్ మహాసభలో

ఆహ్వాన సంఘాధ్యక్షులు



# శ్రీ బెజవాడ పాపిరెడ్డిగారి

## స్వాగతోపన్యాసము

రైతు సోదరులారా!

పెరుగుతున్న ధరలు, తరుగుతున్న జీవితాలు, బండబారిన బ్రతుకు లనుభవిస్తూ వివిధ ప్రాంతాల నుండి ఈ మహాసభకు విచ్చేసిన రైతు పెద్దలకు, రైతు బిడ్డలకు, రైతాంగ శ్రేయోభిలాషులకు స్వాగతం.... సుస్వాగతం. పెనుతుఫానులో చిక్కిన చుక్కానిలేని నావలో దిక్కుతోచని పయనములో కర్తవ్య నిర్ణయం కోసం గుమికూడిన ఆర్తులవలె సమావేశమవుతున్నాము.



మహాసభ నిర్వాహకులు: 1. శ్రీ జొన్నలగడ్డ రామారావు. 2 శ్రీ బత్తుల రమణారెడ్డి. 3. కొల్లా రామలింగయ్య 4. శ్రీ ఇండ్ల వెంకయ్య 5 శ్రీ గణపత్రి పోలయ్యనాయుడు

---

కొన్ని దశాబ్దాలుగా పాలకులు మనల్ని వెన్నెకములనీ, అన్నదాతలనీ అభినందిస్తూ, అధఃపాతాళానికి త్రొక్కుతూ వచ్చారు. సదరు బిరుదులకు మనం చెల్లిస్తున్న మూల్యము ముగింపు దశకు వచ్చే సూచనలు గోచరించుటలేదు. ఈ దేశానికి వెన్నెముకలం కనుకనే వెన్నువిరిగే పన్నుల భారం మోస్తున్నాము జాతికి అన్నదాతలం కనుకనే దారిద్ర్యాన్ని అనుభవిస్తున్నాము—అవి, సరిపెట్టుకొనుటకు సరిపడిన సహనాన్ని కూడ పాలకులు మనకు సరఫరా చేయలేక పోతున్నారు, క్రొత్త క్రొత్త శాసనాలతో రైతు బ్రతుకును దుర్భరం చేస్తున్నారు.

పారిశ్రామికవేత్తలు, వ్యాపార చక్రవర్తులు, చలనచిత్ర వ్యక్తులు లక్షల మేరకు పన్నులు బకాయిపడితే వారి గౌరవంఇబ్బడి ముబ్బడిగా పెరుగుతున్నది. ఈతిబాధలకు లోనై పుస్తెలమ్మి శిస్తులు చెల్లించవలసిన దుస్థితిలో ఉన్న మనపై ప్రభుత్వాధికారులు చేస్తున్న స్వారి మన వృత్తిపైనే మనకు ఏవగింపును కలిగిస్తున్నది. ఈ దేశంలో ప్రభుత్వము నుండి ఆదరాభిమానములను పొందలేని వర్గము ఏదైనా ఉంటే, అది రైతాంగమే। ఏ అధికారిగాని, జవానుకాని లెక్కచెయ్యని వృత్తిదారుడు రైతు మాత్రమే. ఇది ఎవ్వరో కావాలని చేస్తున్న అవమానమని చెప్పడానికి వీలులేదు. ఏ వృత్తిలో ఉన్న వారికైన సంఘటితశక్తి వుంటుంది. రైతులు మాత్రం చెట్టుకొకరు, పుట్టకొకరు సంఘటితశక్తి పోరాటపటిమ లేని వారయ్యారు. ఏ వర్గావి



కార్యనిర్వాహకులలో కొందరు: 1. శ్రీ జె. వి. కృష్ణయ్య. 2. చిట్టమూరు లక్ష్మినరసారెడ్డి. 3. శ్రీ కోసూరు వెంకటస్వామి. 4. శ్రీ పావులూరు వెంకట్రామయ్య 5. శ్రీ శ్రీకాలను వెంకటశేషారెడ్డి

---

కైనా అన్యాయాలు, అవమానాలు సహజం. కాని నిరాశ, నిస్పృహలతో, అనైక్యతతో నిర్వీర్యమైన వర్గాన్ని రాజకీయ పక్షాలు లక్ష్యపెట్టవు లక్ష్యపెట్టిన పక్షము బ్రతికి, బట్టకట్టదు.

1977 నుండి జరిగిన చరిత్ర అదే! గ్రామీణప్రజల సంక్షేమంకోసం కంకణం కట్టుకొన్న చౌదరీ చరణ్‌సింగ్‌ను కోటీశ్వరులు, బడావ్యాపారులు, పెద్ద పత్రికలు, పారిశ్రామికవేత్తలు, గ్రామీణులను దోచుకొనే దళారులు ఒక్కత్రాటిపై నిలిచి ఎదుర్కొన్నారు. గ్రామీణ సంక్షేమం అనే చరణ్ లక్ష్యాన్ని దెబ్బతీశారు. అబద్ధాలను, అపార్థాలను ప్రచారములోపెట్టి, రైతు రాజ్యనిర్మాణాన్ని అడ్డుకున్నారు.

30 సంవత్సరాల స్వరాజ్యంలో గ్రామీణ ప్రాంతాలను, వ్యవసాయాన్ని నిర్లక్ష్యం చేయడం జరిగిందన్న నగ్నసత్యాన్ని జాతి చేత ఒప్పించిన మహానాయకుడు చరణ్‌సింగ్‌ను, తెల్లదొరలు విధించిన ఎక్సయిజు సుంకాన్ని రద్దుచేసి రైతులకు విముక్తి కల్గించిన జాతినేత చరణ్‌సింగ్‌ను అనుసరించడంలో రైతాంగం వైఫల్యం చెందడం శోచనియం. చరణ్‌సింగ్ ప్రభుత్వం ఎరువుల ధరను తగ్గించి రైతులకు




కార్యనిర్వాహకులలో మరి కొందరు: 1. శ్రీ గుత్తుల రామకోటేశ్వరరావు, 2. శ్రీ గద్దం కొండయ్య. 3. శ్రీ మందలపు రామయ్య. 4. శ్రీ పచ్చవ వెంకట కొండయ్య. 5. దూదిశెట్టి పాపారావు.

---

మేలుచేస్తే, ప్రస్తుత ఇందిరా ప్రభుత్వం ఎరువుల ధరలను విపరీత స్థాయిలో పెంచుతున్నది ఈనాటికీ రవాణా సౌకర్యాలులేక, మంచినీటి సదుపాయంలేక, అభివృద్ధికి నోచుకోక వెలవెల పోతున్న గ్రామాలున్నాయంటే అందుకు కారణం రైతాంగంలో సంఘటిత శక్తి లేకపోవడమే,

రెండున్నర ఎకరముల లోపు చిన్నరైతులకు భూమి సిస్తు రద్దు చేస్తున్నామని ప్రకటించిన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం బక్కరైతులను ఇంకా పీక్కుతింటూనే ఉన్నది. రైతులకు పాస్ పుస్తకాల పంపిణీ నెపముతో ప్రజాధనం భోంచేసిన రాష్ట్ర ప్రభుత్వం ఇంతవరకు ఆచరణలో అడుగు ముందుకు వెయ్యకపోగా, యమపాశము లాంటి శాసనము చేయబోతున్నది. అధికారులు నమోదు చేయవలసిన పాస్ పుస్తకాలలో తప్పులుంటే సి. ఆర్. పి. 420 వ శెక్షన్ క్రింద రైతును శిక్షిస్తారట. ఈ శాసనం రైతుల ఆత్మగౌరవానికి సవాల్ వంటిది. రైతులను దొంగలుగా చిత్రించే శాసనము సంగతి అలా ఉండగా, భూమి శిస్తు స్థానంలో మార్కెట్ ప్రవేశ పన్ను అనే రంగుల వలను పన్నుతున్నారు. పెనము నుండి పొయ్యిలో పడడానికి మనము సిద్ధంగా లేమని ముక్తకంఠముతో చెప్పాలి.

కొనబోతే కొరివి, అమ్మబోతే అడవి అనే సామెత అనాదిగా రైతాం



ఆంధ్రప్రదేశ్ కిసాన్ సమ్మేళన్ మహాసభకు విచ్చేసన ప్రతినిధులకు, నాయకులకు
ఆహ్వాన సంఘాధ్యక్షులు శ్రీ బెజవాడ పాపిరెడ్డిగారు స్వాగతము చెబుతున్నారు.
కుడినుండి ఎడమకు కూర్చున్నవారిలో శ్రీమతి నన్నపనేని రాజకుమారి,
శ్రీ బి. సత్యనారాయణరెడ్డి, యం. పి., శ్రీ గౌతు లచ్చన్న ఎం. ఎల్. ఎ
శ్రీ పెద్దిరెడ్డి తిమ్మారెడ్డి, శ్రీమతి చంద్రావతి, శ్రీ వడ్డె శోభనాద్రీశ్వరరావు
యం. ఎల్. ఎ. వెనుకవరుసలో శ్రీ కె. రఘునాథరెడ్డి

# శ్రీ పెద్దిరెడ్డి తిమ్మారెడ్డి అధ్యక్షోపన్యాసము

ఈరోజు ఇంతమంది రైతు పెద్దలను, రైతు సోదరులను చూడగలిగే భాగ్యము కలిగినందులకు సంతోషిస్తున్నాను. రైతు లేకపోతే దేశమే లేదు. రైతు బాగుపడాలంటే రైతులంతా సంఘటితం కావాలి. సంఘాల్ని ఏర్పచుకోవాలి. రైతు ఉద్యమాలను నడపాలి. అప్పుడే రైతులకు మోక్షం కలుగుతుంది. బలహీనుడైన రైతు ఎందుకూ కొరగాడు. చివరకు ఆత్మరక్షణకూడ చేసుకోలేడు. రైతు దేశానికి



మహాసభలో అధ్యక్షోపన్యాసము గావిస్తున్న శ్రీ పెద్దిరెడ్డి తిమ్మారెడ్డిగారు
కూర్చున్నవారిలో కుడినుండి ఎడమకు శ్రీమతి చంద్రావతి. శ్రీ వద్దె
శోభనాద్రీశ్వరరావు యం. ఎల్. ఎ, డాక్టరు శ్రీ కె. సదాశివరావు
వెనుకవరుసలో శ్రీ నాగినేని వెంకయ్య

వెన్నెముక, రైతు అన్నదాత అని ఒకవైపు పొగడ్తలు కురిపిస్తూనే మరోవైపు అతనిని సర్వనాశనము చేయడానికి కుట్ర జరుగుతూనే యున్నది. రైతు బలపడినరోజు ప్రభుత్వము దదుస్తుంది. కార్మికుల, ఉద్యోగులవలె పోరాటపటిమ పెంచుకున్నప్పుడే కోర్కెలు సాధించుకోగలము. ప్రభుత్వ యంత్రాంగాన్ని స్తంభింప చేయగలం. అది



మహాసభకు విచ్చేసిన ప్రతినిధులలో ఒక భాగము

కారుల జులుం అరికట్టగలం. శత విధాల పీడిసున్న ప్రభుత్వపు ఆట కట్టించగలం. తమిళనాడు రైతులలో సంఘటితశక్తి పెరిగింది. వారంత ఒక సంఘంగా ఏర్పడి ప్రభుత్వపు రైతు వ్యతిరేక విధానాలను ఎదుర్కొంటున్నారు. మనకు నేడు వారు ఆదర్శప్రాయులు. చివరకు ప్రాణాలకు కూడ తెగించి పోరాటము నడుపుతున్నారు. వ్యవసాయానికి సంబంధించి కరెంటు రేట్లను తగ్గించుకోవడంలో. అధికారుల జులుంను అరికట్టడంలో వారు ఘన విజయం సాధించారు. వారి మార్గమే మనకు అనుసరణీయం. శిస్తులు, కరెంటు చార్జిలు, పెనాల్టీలు కట్టడం మానండి జులుంచేసే అధికారులకు బుద్ధి చెప్పండి. శిస్తువసూళ్ళలో జరుగుతున్న జప్తులను ఎదిరించండి. విద్యుత్ కోతవల్ల, వైఫల్యాలవల్ల రైతు బాగా నష్టపడిపోతున్నాడు. ఈ నష్టాన్ని ప్రభుత్వమునుండి మనం రాబట్టాలి. నష్టపరిహారము కొరకు ప్రభుత్వాన్ని కోర్టుకు లాగండి. గత అసెంబ్లీ ఎన్నికలలో తమిళనాడు రైతులు తమకు అనుకూలమైన ప్రభుత్వాన్ని ఎన్నుకోవడంలో ఎంతో ధైర్యాన్ని ప్రదర్శించారు. అందుకు వారు ప్రశంసనీయులు వారి ధైర్య సాహసాలే మనకు ఆదర్శం కావాలి. ఇప్పటికే రైతు మోయలేని భారంతో, శిస్తులతో, పన్నులతో, సెస్సులతో సతమతమౌతున్నాడు. ఇవి



మహాసభలో ఉపన్యసిస్తున్న శ్రీమతి చంద్రావతి. శ్రీ గౌతు లచ్చన్న ఎం ఎల్.ఎ
అనువాదం గావిస్తున్నారు. కూర్చున్నవారిలో ఎడమనుండి కుడికి
శ్రీ బి. సత్యనారాయణరెడ్డి యం. పి. శ్రీమతి నన్నపనేని
రాజకుమారి, మున్నగువారు.

చాలక వ్యవసాయ ఆదాయాలపై పన్ను విధిస్తారట: ఈ ప్రతిపాదన ప్రభుత్వం విరమించుకోకపోతే మనం ప్రతిఘటనకు సిద్ధంకావాలి సరైన ప్రోత్సాహం రైతులకు లభిస్తే బంగారం పండిస్తాడు. దేశం దిగుమతులతో నలిగి చావ పనిలేదు, చెరుకు ధర టన్నుకు రు 200-00 లు నిర్ణయించమనంది. ఎందరో రైతులు ముందుకు వస్తారు. చక్కెర దిగుమతులు నిలబడిపోతాయి. ఎవరిమీద మోపని సీలింగును రైతుమీద మొట్టడం అన్యాయం, అన్ని వర్గాలవారి ఆదాయాలు, ఆస్తులపై ఒక క్రమపద్ధతులో పరిమితులు విధించమనండి, రైతు ఆస్తినే కబళించడం దారుణం. ప్రభుత్వం వడ్డీ వ్యాపారం మాని తక్కువ వడ్డీకి రైతుకు ఋణాలు ఇవ్వాలి, ఎన్నాళ్ళనుండో పంటల బీమా, పశువుల బీమా కావాలంటున్నాం. ఇలాంటి సంక్షేమ పథకాల నెందుకు ప్రభుత్వం ప్రవేశపెట్టడానికి వెనుకాడతున్నదో అర్థం కాకుండావున్నది. ఐక్యతతో సంఘంగా నిల్చితే వీటిని సాధించడం ఘనకార్యంకాదు.



మహాసభలో ఉపన్యసిస్తున్న తమిళనాడు రైతుసంఘ ప్రధాన కార్యదర్శి
శ్రీ చిన్ని కృష్ణన్. కూర్చున్నవారిలో కుడినుండి ఎడమకు
శ్రీ వడ్డె శోభనాద్రీశ్వరరావు యం. ఎల్. ఎ.
శ్రీ పెద్దిరెడ్డి తిమ్మారెడ్డి శ్రీ నాగినేని వెంకయ్య

## శ్రీ యస్. హెచ్. నరేంద్రసింగ్ యం.పి ప్రారంభోపన్యాసం

రైతులపట్ల గ్రామీణ సమస్యల పట్ల ప్రభుత్వం తన మొండి వైఖరిని దృక్పధాన్ని మార్చుకోని పక్షంలో దేశవ్యాప్తంగా పెద్ద పోరాటానికి మనం సన్నద్ధం కావాలి. అప్పుడే రైతులలో నిద్రాణమైన చైతన్యం మేల్కొంటుంది. దీర్ఘకాలిక పోరాటానికి సమాయత్తం కావడమే మన ముందున్న కర్తవ్యం. హర్యానా తదితర ఉత్తరాది రాష్ట్రాలలో త్వరలో ఉద్యమాలను ప్రారంభిస్తాం. దేశంలో అధిక సంఖ్యాకులైన రైతుల, గ్రామీణుల శ్రేయస్సుకు భంగకరంగా వ్యవహరించే ప్రభుత్వాన్ని ఇంకేమాత్రం సహించజాలం. రైతులు తిరగబడితే రైతు సమస్యలు వాటంతట అవే పరిష్కారమవుతాయి. రైతులను నిద్ర మేల్కొలపాలి. వారిని ఉత్తేజితులను చేయాలి. తద్వారా రైతు ఉద్యమాన్ని ఉధృతం చేయాలి. అందరు



మహాసభలో ఉపన్యసిసున్న శ్రీ వడ్డె శోభనాద్రీశ్వరరావు, యం. ఎల్. ఎ.
కూర్చున్నవారిలో కుడినుండి ఎడమకు హర్యానా మాజీముఖ్యమంత్రి,
పార్లమెంటు సభ్యులు శ్రీ యస్. హెచ్. దేవీలాల్,
శ్రీ యస్. హెచ్. నరేంద్రసింగ్, యం. పి. శ్రీ పి. తిమ్మారెడ్డి
శ్రీ బి. సత్యనారాయణరెడ్డి, యం. పి. శ్రీ నాగినేని వెంకయ్య
వెనుకభాగములో ఆర్. రాజగోపాల్‌రెడ్డి.

భుజం భుజం కలిపి ఒకటిగా నిలవాలి. చేయి చేయి కలిపి సంఘంలో సభ్యులుకావాలి. ధైర్యంగా ప్రభుత్వ నిరంకుశ విధానాలనుఅప్పుడే ఎదుర్కొగలం. జైళ్ళకు వెళ్ళడానికైనా మరేలాంటి త్యాగానికైనా సిద్ధపడినప్పుడే మన కోర్కెలు తీరుతాయి. మనమాట చెల్లుతుంది. దేశంలో ఆరు లక్షల గ్రామాలలో మంచినీటికి కటకటగా వుంది. గ్రామీణ వాతావరణంలో పుట్టి పెరిగినచౌదరి చరణ్‌సింగ్‌వంటి రైతునాయకుడే రైతు

శ్రేయస్సు కోరగలడు. వారికొరకు పరిశ్రమించగలడు. ఆర్థికమంత్రిగా శ్రీ చరణ్ సింగ్ 27 వేల గ్రామాలకు మంచినీటివసతి కల్పించేందుకు ధనం కేటాయించాడు రైతు అభివృద్ధికి పథకాలను ప్రతిపాదించాడు. పనికి ఆహారపథకాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం ఎంతో విచారకరం. ఎంతో దూరదృష్టితో ఆనాడు ఈ పథకాన్ని రచించారు. రైతులపట్ల ప్రధాని శ్రీమతి ఇందిరాగాంధికి ఏమాత్రం విశ్వాసం లేదు. ఎరువులపై, డీజల్ ఆయిల్ పై ధరలు పెంచి రైతును కుప్ప కూల్చింది ఎరువుల ధరలు పెరగడంతో ఈ ఏడాది ఉత్పత్తి బాగా పడిపోతుంది. మనకీ కష్టాలు తప్పాలంటే సహనంతో వ్యవహరించాలి. సంఘటితులం కావాలి. కుల, మత విద్వేషాలకు అతీతంగా ఐక్యంకావాలి. పోరాటాన్ని సాగించాలి



మహాసభలో ఉపన్యసిస్తున్న శ్రీ నన్నపనేని రాజకుమారి. ఎడమనుండి కుడికికూర్చున్న వారిలో శ్రీ నాగినేని వెంకయ్య, శ్రీ బి. సత్యనారాయణరెడ్డి యం. పి, శ్రీ పి. తిమ్మారెడ్డి, శ్రీ యస్. హెచ్. నరేంద్రసింగ్ యం. పి., శ్రీ యస్. హెచ్. దేవిలాల్ యం. పి. శ్రీ గౌతు లచ్చన్న ఎం ఎల్.ఎ వెనుకవరుసలో శ్రీ కె. రఘునాధరెడ్డి, శ్రీ బెజవాడ పాపిరెడ్డి డాక్టరు కె. సదాశివారావు

## అఖిలభారత కిసాన్‌సమ్మేళన్ అధ్యక్షులు-హర్యానా మాజి ముఖ్యమంత్రి. పార్లమెంటు సభ్యులు శ్రీ యస్. హెచ్. దేవిలాల్ ఉపన్యాసము



మహాసభకు విచ్చేసిన శ్రీ దేవిలాల్‌గారిని శ్రీ గౌతు లచ్చన్న యం. ఎల్. ఎ. పుష్పమాలాంకృతుని గావిస్తున్నారు. కూర్చున్నవారిలో కుడినుండి ఎడమకు శ్రీ యస్. హెచ్. నరేంద్రసింగ్ యం. పి. శ్రీ బెజవాడ పాపిరెడ్డి

ఈ మహాసభలో పాల్గొంటున్న ప్రతినిధులకు, నాయకులకు నా హృదయ పూర్వక వందనాలు. రైతు సమస్యలను కూలంకషంగా జూలై 12. 13. 14 తేదీలలో కురుక్షేత్రంలో జరుగనున్న అఖిలభారత రైతు సదస్సులో చర్చించి నిర్ణయాలు గైకొనగలం. అక్కడ ఆంధ్రప్రదేశ్ రైతులయొక్క ఈతి బాధలు గూడ పరిగణన లోనికి వస్తాయి. ఆ సమావేశంలో రైతాంగ పోరాట విధానాన్ని కూడ రూపొందించ గలం. ఎందరో మహానుభావులు రైతు సమస్యలపట్ల శ్రద్ధ వహించి గతంలో కృషి



మహాసభలో ఉపన్యసిస్తున్న శ్రీ యస్. హెచ్. దేవీలాల్. అనువదిస్తున్నవారు శ్రీ బి. సత్యనారాయణరెడ్డి, యం. పి. కూర్చున్నవారిలో ఎడమనుండి కుడికి శ్రీ పి. తిమ్మారెడ్డి, శ్రీ యస్. హెచ్. నరేంద్రసింగ్ యం.పి. శ్రీ గౌతు లచ్చన్న యం. ఎల్. ఎ.

చేసినా చరణ్‌సింగ్ ఐయామ్‌లోనే రైతుకు గుర్తింపు వచ్చింది. 1962 పార్లమెంటులో కేవలం 18 మంది మాత్రమే రైతు ప్రతినిధులుండగా వారి సంఖ్య ఈనాడు 264 కు పెరిగింది. రైతులలో వస్తున్న చైతన్యానికిది తార్కాణంగా పేర్కొనవచ్చు. గత అసెంబ్లీ ఎన్నికలలో పాలకపక్షం జరిపిన విపరీతమైన రిగ్గింగ్ మూలంగా చరణ్‌సింగ్ పార్టీ విజయం సాధించలేక పోయింది. తాత్కాలికమైన ఈ అపజయానికి విస్పృహ, నిరాశ చెందవవసరము లేదు. అంతిమ విజయం రైతులదే. రైతు పార్టీదే. రైతు నాయకులదే...



నెల్లూరు కో-ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంకు ఆవరణంలో జరిగిన
బహిరంగ సభలో పాల్గొన్న ప్రేక్షకులలో నొక భాగము.

శ్రీ సర్దార్ గౌతులచ్చన్న యం. యల్. ఏ

ఆచార్యరంగా నాయకత్వంలో 40 ఏండ్లకు పైగా రైతు ఉద్యమాలను నిర్వహించాం. ఆ రోజులలో బడులు మానుకొని జమీందారీ. యినాందారీ, శ్రోత్రియం దారీ విధానాలకు వ్యతిరేకంగా పోరాటం నడిపి విజయం సాధించాం. ఆ ఉద్యమంలో నెల్లూరుజిల్లా ప్రధాన పాత్ర వహించింది, వెంకటగిరిలో ప్రారంభమైన రైతు ఉద్యమం యావత్ భారత రైతోద్యమంగా రూపుదాల్చింది. కీర్తిశేషులు నెల్లూరు వెంకట్రామానాయుడు మరి కొంతమంది మిత్రులు ఆనాడు రైతోద్యమానికి ఎన్నో అండదండలు సమకూర్చారు ఆనాటి ఆదర్శమే ఈనాడు ఈ జిల్లాలో ఆంధ్రప్రదేశ్ కిసాన్ సమ్మేళన్ మహాసభ జరుపుటకు కారణమయిందని భావిస్తున్నాము. గత రోజులలో ప్రదర్శించిన మగటిమ, త్యాగం, పట్టుదల, ధైర్య స్థయిర్యాలు నెల్లూరు జిల్లా రైతాంగము ద్వారా భారత రైతాంగానికి ఆంధ్రప్రదేశ్ రైతులకు లభిస్తుందని



బహిరంగ సభలో శ్రీ గౌతు లచ్చన్న యం. ఎల్. ఎ. ఉపన్యసిస్తున్నారు.
శ్రీ బెజవాడ పాపిరెడ్డి అధ్యక్షస్థానములో నున్నారు.

విశ్వసిస్తున్నాం. రైతుల్లో ఐక్యత, సంఘటితశక్తి పూజ్యమైతే వారి బ్రతుకే భారమవుతుంది. ఇటీవల ఎరువుల ధరలలో వచ్చిన పెరుగుదల రైతులో మిగిలివున్న జవసత్త్వాలను పూర్తిగా హరించింది. ఈ చర్య వినియోగదారు వెన్నెముక విరిచే పథకమని అనుకోవడంలో తప్పులేదు. రైతులేనిదే రాజ్యంలేదనే సత్యాన్ని ఏనాడు ప్రభుత్వం గుర్తిస్తుందో అనాడే దేశం బాగుపడుతుంది. గ్రామాలు సస్యశ్యామలం కాగలవు. బడ్జెట్ ప్రవేశపెడుతున్న తరుణంలో ఎరువుల ధరను పెంచటంలో గల అంతర్యం అర్థం కావడంలేదు. రైతులకు మద్దతు ధరతోపాటు అమ్ముకునే స్వేచ్ఛ కావాలి. దేశంలో నేడు రాజకీయ వ్యభిచారము స్వైరవిహారము చేయుచున్నది. రాబోయె సవంత్సరాలలో విచిత్రమైన, అనూహ్యమైన పరిణామాలు సంభవించగలవు. రైతులు సుసంఘటితమైనప్పుడు ఎలాంటి అవాంతరాలనైనా అధిగమించవచ్చు. రైతుల సమస్యలు వేడికోలుద్వారా గాక ఐక్యపోరాటాలద్వారా సాధించుకోవాలి. అలాంటి సంఘనిర్మాణానికి అందరు చేయూత నివ్వాలి.

హర్యానా కిసాన్ నాయకురాలు మాజి మంత్రి శ్రీమతి చంద్రావతిదేవి

రైతులు తమ బిడ్డల విద్యపట్ల అత్యంత శ్రద్ధవహించాలి. రైతు కుటుంబాలు జాగృతం కావడానికి. చైతన్యవంతం కావడానికి విద్య ప్రథమ సోపానం. రైతులే రేపటి పాలకులు. రాజకీయ చైతన్యానికి విద్య మూల కందం. విద్యలేని రైతు పాతరోజులలో నుండి బైటపడలేడు అతడు ఏ రంగంలో రాణించలేడు.



బహిరంగ సభలో శ్రీ యస్, హెచ్. నరేంద్రసింగ్ యం. పి. ఉపన్యసిస్తున్నారు. శ్రీ వీరయ్య హిందీ ఉపన్యాసానికి అనువాదం గావించుచున్నారు. వేదికపై ఆశీను లైన వారిలో కుడినుండి ఎడమకు శ్రీ గౌతు లచ్చన్న యం. ఎల్. ఎ. శ్రీ యస్, హెచ్. దేవీలాల్ యం. పి. శ్రీ బెజవాడ పాపిరెడ్డి, శ్రీమతి నన్నపనేని రాజకుమారి, శ్రీ వడ్డె శోభనాద్రీశ్వరరావు, ఎం. ఎల్. ఎ. శ్రీమతి చంద్రావతి, శ్రీ బి. సత్యనారాయణరెడ్డి యం. పి. శ్రీ పెద్దిరెడ్డి తిమ్మారెడ్డి, (ఆంధ్రప్రదేశ్ కిసాన్ సమ్మేళన్ అధ్యక్షులు)

నేడు దేశంలోని వివిద ప్రాంతాలలో రగులుతున్న కుల, భాష వర్గభేదాల కారణంగా వివాదాలను పరిష్కరించటం మాని వాటిని అధికార పక్షం తమ స్వార్థ ప్రయోజనానికి వినియోగించుకుంటున్నది. ఇందిరా గాంధి పాలనలో దేశం ఎన్నో కష్ట నష్టాలను ఎదుర్కొన్నది. ఎన్నో చీలికలు సంభవించినవి ఇంకెన్ని చీలికలు కానున్నదో వేచి చూడవలసినదే. ప్రస్తుతము రాజకీయ వాతావరణముపట్ల రైతు సోదరులు అప్రమత్తుగా వుండాలి దేశ వ్యాప్తమైన కార్యక్రమాన్ని వారు రూపొందించుకొని కార్య సాధనకు పూనుకోవాలి పరిస్థితులు చూస్తుంటే గాంధీజీ ఉద్బోధనలకు, సిద్ధాంతాలకు కట్టుబడి పని చేసేవారు ఎందుకు కొరగాని వారుగా భావింపబడుతున్నారు. సత్య అహింసలను కట్టిపెట్టి ఆయుధాలు ధరించడమే ప్రస్తుత కాలానికి తగినట్లు వుండి గలదని అభిప్రాయపడుతున్నాము. ఇంతమంది రైతు సోదరులను కలుసుకునే అవకాశం కల్పించిన ఆహ్వాన సంఘంవారికి కృతజ్ఞతలు తెలుపుతున్నాను.

శాసనసభ్యులు శ్రీ వడ్డీ శోభనాద్రీశ్వరరావు ఎం. ఎల్. ఎ.

పొగాకు అమ్మకంపై డ్యూటిని రద్దుచేసి రైతులకు మహోపకారం చేసిన రైతుభాందవుడు శ్రీ చరణ్‌సింగ్‌కు నా కృతజ్ఞతలు. రైతు సమస్యలను చర్చించి పరిష్కరించి కమిటీలలో రైతు ప్రతినిధులకు ప్రాతినిధ్యం లేకపోవటం విచారకరం ఈ కమిటీలలో జరిగే నిర్ణయాలలో ఏమేరకు రైతు శ్రేయస్సు ప్రతిబింబిస్తుందో ప్రభుత్వం యోచించాలి. అగ్రికల్చరల్ ఫైనాన్స్ కమీషన్‌లో రైతువాణికి స్థానం లభించలేదు. 1980 జనవరిలోగా రాష్ట్రమంతటా రైతులకు పాస్ పుస్తకాలు పంచుతామని డంభాలు పలికిన రాష్ట్రప్రభుత్వం ఈనాటికి 5 శాతం రైతులకు కూడ పాస్ పుస్తకాలు ఇవ్వలేకపోయింది. రికార్డు ఆఫ్ రైట్స్ చట్టంలో రైతుకు వ్యతిరేకంగా పొందుపరచిన క్రిమినల్ సెక్షన్‌ను వెంటనే ప్రభుత్వం ఉపసంహరించాలి. రైతులపట్ల జరిగే కుట్రలు ఇంకెంతోకాలం కొనసాగబోవని ఈ వేదికనుండి ప్రభుత్వాన్ని హెచ్చరిస్తున్నాను రైతుల కోర్కెలను ప్రభుత్వం పరిష్కరించలేకపోతే సెప్టెంబరు అక్టోబరు నెలలోనె ప్రత్యక్ష చర్యలకు దిగవలసి వస్తుంది. అబందరంగా, అస

మర్థంగా సాగుతున్న విద్యుత్ బోర్డు పాలన క్షీణం కావాలి చీటిమాటికి విద్యుత్ ఉద్యోగులు రైతులను బెదరించే ధోరణి విడనాడాలి. ప్రభుత్వం వడ్డీవ్యాపారం చేయటం మానుకొని రైతు శ్రేయస్సు దృష్ట్యా 6 శాతం వడ్డీకే ఋణాలు మంజూరు చేయాలి భూమి శిస్తు స్థానే మార్కెట్టు పన్ను విధించే ప్రతిపాదనను ప్రభుత్వం విరమించాలి. ఎరువులపై, డీజల్ ఆయిల్‌పై పెంచిన ధరలను సరిదిద్దాలి. రైతులకు ప్రత్యక్ష చర్య గత్యంతరమైతే అందుకు అందరు సిద్ధపడి ఉండాలి. తమిళనాడు రైతు సోదరులవలె ప్రభుత్వ దమన నీతిని ధైర్యంగా ఎదుర్కొనడానికి సన్నద్ధం కావాలని ఈ సభకు విచ్చేసిన రైతాంగ ప్రతినిధులను, కార్యకర్తలను కోరుతున్నాను.

## శ్రీమతి నన్నపనేని రాజకుమారి

భూపరిమితి చట్టముక్రింద మహిళలకు, మైనరు పిల్లలకు అన్యాయం జరిగింది. వ్యవసాయము స్వతంత్ర వృత్తి ఉద్యోగాలంటూ ఊరేగేకన్న రైతు బిడ్డలు భూమిని నమ్ముకొని గౌరవప్రదమైన సేద్యాన్ని నమ్ముకోవడం యోగ్యంగా వుంటుంది వ్యవసాయాన్ని పరిశ్రమగా ప్రభుత్వము గుర్తించి రాయితీలు, ప్రోత్సహకాలు విరివిగా సమకూర్చాలి. అప్పుడే రైతుకు గిట్టుబాటు ధరలు లభిస్తాయి. రైతులు కూలీలు సామరస్యంగా కృషిచేస్తే దేశం మూడు పువ్వులు అరు కాయలుగా విలసిల్లుతుంది ఆహ్వాన సంఘ ప్రధాన కార్యదర్శి శ్రీ మొగిలి లీలామోహన్ (అడ్వొకేటు) తీర్మానాలు ప్రతిపాదింగా ప్రతినిధులలోని ఈ క్రిందివారు తీర్మానాలపై చర్చ ప్రారంభించారు. సర్వశ్రీ బి. సత్యనారాయణరెడ్డి యం. పి. గారపాటి కృష్ణమూర్తి. డాక్టర్ వి. వి. గోపాలకృష్ణ. కోగంటి వెంకటేశ్వరరావు. డాక్టర్ కె. సదాశివరావు. జి పాండురంగారావు. సోంపల్లి శివరామకృష్ణయ్య. షేక్ హసన్, నాగినేని వెంకయ్య. పర్లపోలు సాంబయ్య. జాస్తి లక్ష్మీకృష్ణ శ్రీరంగనాయకులు. కె శంకర్‌రెడ్డి. జి జయసింహ రెడ్డి. పి. రఘునాధరెడ్డి.ఆర్. రాజగోపాలరెడ్డి. సి. వి. సుబ్బారెడ్డి. డి. సాల్మన్. యమ్. మాధవరెడ్డి. డి ముకుందం. చిన్నికృష్ణన్. పి బాలప్ప. యం. ముత్యాలరెడ్డి. ఆర్. లక్ష్మయ్య. పి. వి. సుబ్రమణ్యం. కె యుగంధర్. యం. శీతారామస్వామి యం. భూపతినాయుడు. దేవిరెడ్డి కోదండరామిరెడ్డి. హనుమంతరెడ్డి. సుబ్బారావు తదితరులు.

తీర్మానము నెం. 1:

ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికలలో తమిళనాడు గ్రామీణ ప్రజలు, రైతు సోదరులు, సంఘటితముగా నిలబడి, తమకు సహాయపడగల పార్టీకి ప్రభుత్వము నేర్పాటుచేయు బలమును చేకూర్చి తమ శక్తిని రుజువు చేసినందుకు యీ సభవారు వారిని అభినందించడమైనది.

తీర్మానము నెం. 2:

తమ హక్కుల సాధనకు, సమస్యల నివారణకు, తమిళనాడు, మహారాష్ట్రలలోని రైతులు, ప్రభుత్వముతో సాగించిన పోరాటములో, అసువులు బాసిన రైతు వీరులకు జోహార్లర్పిస్తూ, తమ కోర్కెల సాధనకై నడిపిన వుద్యమములో ఆయా ప్రభుత్వాలచే వుద్యమకారులపై మోపబడిన తప్పుడు కేసులను వెంటనే వుపసంహరించాలని కోరడమైనది.

1979 జూన్‌నెల 15వ తేదీన తుపాను బాధితుల సహాయార్థం నడిపిన వుద్యమములో, పోలీసు కాల్పులకు గురియై మరణించిన కావలి తాలూకా, గౌరవరం గ్రామ రైతుబిడ్డ శ్రీ చింతం శేషారెడ్డిగారికి యీ సభవారు శ్రద్ధాంజలి ఘటించడమైనది.

తీర్మానము నెం. 3:

పొగాకు వుత్పత్తిదారులు లైసెన్సులు, పర్మిట్లును సంపాదించడంలో పడుతున్న బాధలను, పండించిన పొగాకు గిట్టుబాటు ధరలేక, పొగాకుమీద విధించబడుతున్న ఎక్సైజుడ్యూటీని గూడా కట్టలేని రైతులయొక్క దీనస్థితిని గుర్తించి, పొగాకు డ్యూటీని రద్దుచేసి రైతును యీతి బాధలనుండి విముక్తి కలిగించిన మాజీ ప్రధానమంత్రి, రైతునాయకుడు శ్రీ చౌదరి చరణ్‌సింగ్‌గారిని యీ సభవారు అభినందించడమైనది.

తీర్మానము నెం. 4:

మన దేశములో చక్కెర వుత్పత్తి చేసి, యెగుమతి చేయుటకు గూడ అపారమైన వనరులున్నవి. 1977 లో చక్కెర యెగుమతి చేసి ప్రభుత్వము దాదాపు 300 కోట్ల రూపాయల విదేశీమారకద్రవ్యాన్ని సంపాదించింది. కాని ఇటీవల చెఱకుకు గిట్టుబాటు ధరలేక, రైతు చెరకు పండించుటకు ముందుకు రాలేకపోవుటచే, చక్కెరకు కొరత యేర్పడడం, యీ లోటు పూడ్చుటకు ప్రభుత్వమువారు దాదాపు 70 కోట్ల రూపాయలు విదేశీమారకద్రవ్యాన్ని వెచ్చించి, 2 లక్షల టన్నుల చక్కెర దిగుమతి చేసుకొనడాన్ని గర్హిస్తూ, చెఱకుకు గిట్టుబాటు ధర నిర్ణయించి, చెఱకు వుత్పత్తి గణనీయంగా పెంచి, చక్కెర లోటు పూడ్చుటకు దోహదం చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని యీ సభవారు కోరడమైనది.

తీర్మానము నెం. 5:

(ఎ) ధాన్యము మొదలగు వ్యవసాయ పంటలకు ధర నిర్ణయించుటకు "అగ్రికల్చరల్ ప్రైసెస్ కమీషన్" "వ్యవసాయ పంటల ధరల నిర్ణయాక సంఘము" అనే దానిని కేంద్ర ప్రభుత్వము వ్యవసాయానుభవము లేనివారితో యేర్పాటు చేసినందున వారు వ్యవసాయదారులకు న్యాయము చేకూర్చలేకపోతున్నారు, రైతు సంఘాల ప్రతినిధులను, వ్యవసాయ కుటుంబాలకు చెందిన పార్లమెంటు సభ్యులను పై కమీషన్‌లో సభ్యులుగా నియమించటంద్వారా. కమిటీని పునర్నిర్మాణం గావించాలని యీ సభవారు ప్రభుత్వాన్ని కోరడమైనది.

(బి) ఉత్పత్తి ఖర్చులు కూలీలు, పన్నులు వర్షపరిస్థితి, విద్యుచ్ఛక్తి విఘాతము, తెగుళ్ళు, ప్రకృతి వైపరీత్యాలు మొదలగు వూహించలేని నష్టాలను గుర్తించి పర్యవేక్షణ, రైతు కుటుంబపోషణ మొదలగు వివరముల మీద ఆయా పంటల ధరలను నిర్ణయించాలని యీ సభవారు ప్రభుత్వాన్ని కోరడమైనది,

వాడకందారు "కన్స్యూమర్" పేరుతో ధరలు తగ్గించడంవలన వుత్పత్తి దారుడు "రైతు" విపరీతంగా నష్టపడుతున్నాడు. కాన పంటకు గిట్టుబాటు ధర నిర్ణయించి, శక్తిలేని వినియోగదారునికి ప్రభుత్వము సబ్సిడిద్వారా ప్రత్యేక సదుపాయాలు కల్పించాలని యీ సభవారు ప్రభుత్వాన్ని కోరడమైనది.

(సి) పంజాబు, తమిళనాడు రాష్ట్రిలలో ప్రభుత్వము నిర్ణయించిన ధర కంటే 15 రూపాయల వరకు అదనముగా యిచ్చి, రాష్ట్ర సివిల్ సప్లయిస్‌వారు ధాన్యము కొనుగోలు చేసిన విధముగానే, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము గూడ ధాన్యము కొనుగోలు చేయవలెనని కోరడమైనది.

(డి) ఇతర రకములవలెగాక "మొలగొలుకులు" ఆరు నుండి ఆరున్నర మాసముల పంట వ్యవధి తీసుకొంటున్నందున "మొలగొలుకుల"ను "సూపర్‌ఫైన్" రకముగా గుర్తించాలని వ్యవసాయ ధరలనిర్ణయాక సంగాన్ని కోరడమైనది.

తీర్మానము నెం. 6 :

వ్యవసాయమునకు ప్రధానమైన యెరువులపైన, డీజల్‌పైన అమాంతంగా ధరలు పెంచటాన్ని ఈ మహాసభ తమదిగ్భ్రాంతిని వ్యక్తంచేస్తూ, వ్యవసాయోత్పత్తి ఖర్చులు మోయరాని భారముకాగా. ప్రభుత్వము పెంచినయెరువులు, డీజల్ ధరలు, రైతును క్రుంగదీయుటకు కారణంకాబోతున్నదిగాన. వుత్పత్తికి ప్రాధాన్యతకల్పించి, రైతులను వూపిరిపీల్చుకొనేటట్లు చేయాలన్న తలంపే ప్రభుత్వానికుంటే, పెంచిన ధరలను వెంటనే ఉపసంహరించాలని, ఈ మహాసభ ప్రభుత్వాన్ని కోరుతున్నది.

తీర్మానము నెం. 7 :

రాష్ట్రప్రభుత్వము 1980 జనవరి నెలలోనే రాష్ట్రమంతటా రైతులకు పట్టాద్వారా పాస్‌పుస్తకాలను పంచుతున్నామని ప్రకటించినా, యిప్పటికి నూటికి ఐదుమంది రైతులకుకూడ ప్యాసుపుస్తకాలను సరఫరా చేయలేదు. వెంటనే అన్నివివరాలలో పూర్తిచేయబడిన పట్టాదారుడు ప్యాసుపుస్తకాలను రైతులను అందించాలనియు,

రికార్డు ఆఫ్ రైట్సు బిల్లులో రైతులపై విధించిన క్రిమినల్ సెక్షన్‌ను వుపసంహరించాలని, అట్లు చేయని యెడల అక్టోబర్ నుండి రైతాంగం ప్రత్యక్ష చర్యకు పూనుకోవలసి వుంటుందని రాష్ట్ర ప్రభుత్వాన్ని యీ సమావేశము హెచ్చరిస్తున్నది.

తీర్మానము నెం. 8:

గ్రామాలలో మాగాణులను మెరక చేసుకొని కొందరు మెట్టభూములలో మరికొందరు, ఇండ్లు, చావడులు. వాములను వేసుకొనడం జరుగుతున్నది. అటువంటి భూములపై శిస్తులు, సెస్సులు విధించరాదని, వసూళ్ళు చేయరాదని, ప్రభుత్వ వుత్తరువులున్నప్పటికి రెవిన్యూ యంత్రాంగం వాటి వసూళ్ళకు పూనుకొనడం అత్యంత శోచనీయం. వెంటనే అటువంటి భూప్రదేశాలను గ్రామ కంఠములో చేర్చి. కేవలం నాన్-అగ్రికల్చరల్ సెస్సుమాత్రమే వసూలు చేయాలని యీ సమావేశము ప్రభుత్వాన్ని డిమాండు చేస్తున్నది 1974 సం. దరిమిలా వసూలు చేసిన సెస్సు మొత్తమును ముదరా యివ్వవలెనని కోరుతూ తీర్మానించడమైనది.

తీర్మానము నెం. 9:

నాగార్జునసాగర్ ఆయకట్టునుండి వచ్చు మురుగునీటి విషయములో తగు పథకాలు రూపొందించనందున పొన్నూరు. చీరాల ప్రాంతాలలో అనేక వేల ఎకరాల భూమి నల్లమడ. నక్కవాగుల వలన ప్రతి యేటా తీవ్ర నష్టమునకు గురియౌతున్నవి. వరుసగా ఆరు సంవత్సరముల నుండి పంటలు కోల్పోయిన ఫలితంగా ఆ ప్రాంతము రైతాంగము అప్పులు తీర్చగల స్థితిలో లేనందున సదరు ఋణాభారాన్ని రద్దు చేయవలసినదిగా రాష్ట్ర ప్రభుత్వాన్ని యీ సమావేశము కోరడమైనది.

తీర్మానము నెం. 10:

ఇటీవల భూమి శిస్తు వసూళ్ళు, భూసేకరణ అధికారాలను రాష్ట్రప్రభుత్వాల నుండి కేంద్రప్రభుత్వము సంగ్రహించడం అత్యంత గర్హనీయము. ఈ చర్య

రాజ్యాంగము నిర్దేశించిన ఫెడరల్ సూత్రాలకు పూర్తి విరుద్ధమని యీ సమావేశము భావిస్తున్నది. ఇప్పటికే వివిధ రూపాలలో విధించబడుతున్న శిస్తులు, సెస్సులు, పన్నుల భారముతో రైతు కృంగిపోతుండగా, కాలదోషంపట్టిన రాజ్‌కమిటీ సిఫారస్సుల ననుసరించి వ్యవసాయదాయంపై పన్ను విధించాలనే కేంద్రప్రభుత్వ తలంపు రైతును అధికార యంత్రాంగంయొక్క దోపిడికి గురయ్యేదానికి మాత్రమే వుపయోగ పడుతు దని నమ్ముతూ, వ్యవసాయదాయంపై పన్ను విధించే ప్రతిపాదనను వుపసంహరించుకోవలసినదిగా కేంద్రప్రభుత్వాన్ని యీ సమావేశము కోరడమైనది

తీర్మానము నెం. 11

గిట్టుబాటు ధరలు లభించకపోవడముచే, రైతులు వంట నూనెలకు అవసరమైన పంటలను పండించలేకపోతున్నారు. దీనివలన ప్రభుత్వము ప్రతియేటా విపరీతముగా విదేశీమారకద్రవ్యాన్ని వెచ్చించి వంటనూనెలను దిగుమతి చేసుకోవలసిన పరిస్థితి దాపురించినది. పంటకు తగిన గిట్టుబాటు ధర నిర్ణయించి, రైతుకు తగిన ప్రోత్సాహమిస్తే దేశ అవసరాలకు సరిపడు వంట నూనెలకు అవసరమగు పంటలను పండించే అవకాశం వున్నదని, అనవసరమైన దిగుమతులను అరికట్టవచ్చునని యీ మహాసభ అభిప్రాయపడుతున్నది

తీర్మానము నెం. 12

స్వరాజ్యము వచ్చిన మూడు శతాబ్దముల నుండి మన దేశము విదేశాల నుండి దిగుమతులపై ఆధారపడి నూలు, గుడ్డ మిల్లులను నడిపింది. కాని 1974-75 సంవత్సరములో రైతులు అధిక వ్యయప్రయాసలకు గూడ సిద్ధపడి మన దేశ అవస రాలకే గాకుండా, యెగుమతి చేసేందుకు గూడ సరిపడే ప్రత్తి పండించడం జరిగింది. దరిమిలా గిట్టుబాటు ధరలేక ప్రత్తి పంట తగ్గించడం. తిరిగి విదేశాలనుండి మన అవసరాలకు ప్రత్తి దిగుమతి చేసుకోవలసిన దుస్థితి యేర్పడడం జరిగినది. ప్రత్తి పండించు రైతు, మిల్లు ప్రభుత్వ ప్రతినిధులు సమావేశమై చర్చలు జరిపి, రైతుకు

న్యాయమైన గిట్టుబాటు ధర నిర్ణయిస్తే, ప్రత్తి దిగుమతి నివారించడమే గాకుండా, యెగుమతి గూడా చేసి. విదేశీమారకద్రవ్యాన్ని సంపాధించే అవకాశాలున్నాయని యీ సభవారు ప్రభుత్వానికి తెలియజేస్తున్నారు.

తీర్మానము నెం. 13:

వ్యాపార పంటలైన పసుపు దనియాలు, ఏలకులు, లవంగాలు, మిర్చి వగైరాలు పండించేందుకు గూడా మన దేశములో తగిన వాతావరణ పరిస్థితులు, అవకాశాలు వున్నవి. రైతుల సహాయ, సహకారములతో ప్రభుత్వమువారు దేశాన్ని స్వయంసమృద్ధిజేసి, విదేశీమారకద్రవ్యాన్ని సంపాధించే ప్రయత్నము చేయవలసినదిగా యీ సమావేశము ప్రభుత్వమువారిని కోరడమైనది.

తీర్మానము నెం. 14:

పెట్టిన పైరు, పండిన పంట యింటికి చేరువరకు పైరు అనేక రోగాలకు గురియై రైతుకు ఆందోళన కలుగచేయుచున్నది, తెగుళ్ళ మందుల ధరలు ఆకాశాన్నంటేదే గాకుండా, వీటిలో కల్తీలు గూడా వచ్చుచున్నవి ప్రభుత్వము వెంటనే యీ మందుల తయారీ ఖర్చులను పరిశీలన జరిపించి, ధరలు నిర్ణయించి, కల్తీ నిరోధానికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరడమైనది.

తీర్మానము నెం. 15:

వ్యవసాయానికి యే విధమైన అవాంతరాలు రాకుండా వుండగలందులకు విద్యుచ్ఛక్తి సరఫరా, వ్యవసాయదారులకు సక్రమంగా లభించేటట్లు చూడాలని, యూనిట్ రేటును 12 పైసలకు తగ్గించడమేగాకుండా, విద్యుచ్ఛక్తి సరఫరాలో లోపం వలన కలిగిన నష్టాన్ని రైతుకు పరిహారం యిచ్చి, ఆదుకోవాలని ప్రభుత్వాన్ని, విద్యుచ్ఛక్తి బోర్డువారిని యీ మహాసభ కోరడమైనది. ఈ విషయంలో ప్రభుత్వమువారు

నిర్లక్ష్యంచేస్తే, తమిళనాడు రాష్ట్రములోవలె రైతాంగము ఆందోళన జరపవలసిన పరిస్థితులేర్పడగలవని యీ సమావేశము హెచ్చరిస్తున్నది.

తీర్మానము నెం. 16 :

రిజర్వు బ్యాంకి నుండి 6% వడ్డీకి డబ్బుతెచ్చి, రైతు నుండి 10% 15% వరకు వసూలుచేస్తున్న ప్రభుత్వ విధానాన్ని ఖండిస్తూ, రిజర్వు బ్యాంకికి చెల్లించు వడ్డీమీద 1% లేక 2% మాత్రమే అదనముగా వేసి వసూలుచేసి రైతుకు ఋణభారాన్ని తగ్గించాలని, అలాకానప్పుడు రైతులు తమ ఆందోళనద్వారా ఈ సమస్య పరిష్కారానికి పోరాటము జరపవలసి వస్తుందని యీ మహాసభ ప్రభుత్వానికి గుర్తుచేస్తున్నది.

తీర్మానము నెం. 17:

వ్యవసాయమునకు వుపయోగపడే స్ప్రేయర్లు, కిరెంటు మోటార్లు, ఆయిల్ ఇంజన్‌లు, ట్రాక్టర్లు మొదలగు యంత్ర సామాగ్రి, స్పేరుపార్టుసమీద కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విధించే పన్నులు రద్దు చేయవలెనని కోరడమైనది.

తీర్మానము నెం. 18:

పశువుల, పంటల బీమా పథకాలు ప్రవేశపెట్టవలెనని యెంతోకాలం నుండి రైతులు ఆందోళన చేస్తున్నప్పటికీ, ప్రభుత్వము ముందుకు రాలేకపోతున్నది. కాలయాపన చేయక వెంటనే పశువుల, పంటల బీమా పథకాన్ని ప్రవేశపెట్టాలని ప్రభుత్వాన్ని యీ సమావేశము కోరడమైనది

తీర్మానము నెం. 19:

వ్యవసాయ వస్తువులు రవాణా చేసేందుకు అవసరమై వ్యాగనులు కేటాయించడమే గాకుండా, పండ్లు, కూరగాయలకు కొయ్యతో తయారుచేయబడిన వ్యాగనులు సరఫరాజేసి, వాటిని "పెరిషబుల్" త్వరగా చెడిపోవు వస్తువులక్రింద నిర్ణయించి చార్జీలు నిర్ణయించవలెనని కోరడమైనది

తీర్మానము నెం. 20:

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము 2½ ఎకరా మాగాణి. 5 ఎకరాల మెట్ట లోపుగల రైతులకు భూమి శిస్తు రద్దుచేస్తున్నామని వొకవైపు ప్రకటిస్తూ, మరొకవైపు మార్కెట్టు పన్ను ప్రవేశపెట్టి అనేకరకాల పన్నులు విధించ బూనడం పరోక్షంగా రైతుకు మోయలేని భారమౌతున్నందున యీ సభవారు మార్కెట్టుపన్ను ప్రతిపాదనను తీవ్రంగా వ్యతిరేకిస్తు, ప్రభుత్వముగనుక మొండి వైఖరితో దానిని అమలుపరచుటకు ప్రయత్నించిన యెడల రైతాంగం తమ సర్వశక్తులు వొడ్డి ప్రతిఘటించగలరని. యిందుమూలముగా రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించడమైనది.

తీర్మానము నెం. 21:

ఒకదానివెంట వొకటి తోరణాలవలె నుండు చెఱువుల మరమ్మత్తులను వెంటనే చేస్తు, వొక చెఱువు తెగి మరొకదానిపైబడి, దానిని గూడా తెంచే ప్రమాదాలను తగ్గించవలసినదిగా రాష్ట్రప్రభుత్వాన్ని ఈ మహాసభ కోరుతూ తీర్మానించడమైనది.

చెఱువులో తట్టు భూములు శాశ్వత కౌలుకు యివ్వకుండా చెఱువు అభివృద్ధికి, నీటి నిలకడకు తోడ్పడవలసినదిగా ప్రభుత్వాన్ని ఈ సమావేశం కోరుతూంది.

తీర్మానము నెం. 22:

రైతులు చెల్లించే రెవిన్యూ పన్నులు, విద్యుత్ చార్జీలు. గవర్నమెంటు బాకీలు, భూమి తనఖాబ్యాంకి బాకీ వసూళ్ళలో జప్తులు మొదలగు కఠిన చర్యలు తీసుకొని రైతులను మానసిక ఆందోళన, అవమానాలకు గురిచెయ్యవద్దని ఈ సమావేశము ప్రభుత్వాన్ని కోరడమైనది,

తీర్మానము నెం. 23:

భూపరిమితి చట్టమువలెనే, మిగతా ఇండ్లు, బ్యాంకు డిపాజిట్లు, కంపెనీ షేర్లు, వ్యాపారాదాయాలు. జీతభత్యాల ఆదాయాలను గూడా సమన్వయపరచి ప్రజలందరికి సమాన అవకాశాలు, హక్కులు కల్పించాలని యీ మహాసభ ప్రభుత్వాన్ని కోరడమైనది.

# ఆంధ్రప్రదేశ్ కిసాన్ సమ్మేళన్ కార్యనిర్వాహక వర్గము

అధ్యక్షులు శ్రీ పి. తిమ్మారెడ్డి–3-4-136, బర్కత్‌పుర్, హైద్రాబాద్-500027

ఉపాధ్యక్షులు డాక్టర్ కె. సదాశివరావు–పీపుల్స్ నర్సింగ్‌హోమ్, కొత్తపేట
గుంటూరు-522001

ఉపాధ్యక్షులు: డాక్టర్ వి. వి. గోపాలకృష్ణ–కొవ్వలి పోస్టు, ఏలూరు
తాలూకా. పశ్చిమగోదావరి జిల్లా

ప్రధాన కార్యదర్శి: శ్రీ వడ్డె శోభనాద్రీశ్వరరావు యం. ఎల్. ఎ. ఉయ్యూరు.
కృష్ణజిల్లా.

కార్యదర్శి: శ్రీ ధనెంకుల నరసింహం–3/329 లక్ష్మీపురం, నెల్లూరు-524002

సభ్యులు: శ్రీ మొగిలి లీలామోహన్ అడ్వొకేటు–శ్రీరంగరాజపురం, ఉస్మాన్
సాహెబ్‌పేట, నెల్లూరు-524002

" శ్రీ కొన్నలగడ్డ రామారావు–యిందుకూరుపేట, నెల్లూరు.

" శ్రీ మాగంటి శీతారామస్వామి–సోమవరప్పాడు, ఏలూరుతాలూకా,
పశ్చిమగోదావరి జిల్లా.

" శ్రీ ఆర్. రాజగోపాలరెడ్డి–ఎడిటర్ "మాసీమ" నరసరామయ్యవీధి,
మోచంపేట, కడప-516001

" శ్రీ డి. ముకుందం–బాయ్‌పూర్‌గ్రామము, ఖానాపూర్ పోస్టు,
నాగర్ కర్నూలు తాలూకా, మహబూబ్‌నగర్ జిల్లా.

" శ్రీ సోంపల్లి శివరామకృష్ణయ్య–అమృతలూరు, తెనాలి తాలూకా,
గుంటూరు జిల్లా.

" శ్రీ యడ్ల రంగారావు—తెనాలి, గుంటూరు జిల్లా.

" శ్రీ కోగంటి వెంకటేశ్వరరావు—పరిటాల, నందిగామ తాలూకా కృష్ణజిల్లా.

" శ్రీ షేక్ హసన్—చీరాల, ప్రకాశం జిల్లా.

" శ్రీ యం. మాధవరెడ్డి అడ్వొకేటు H. No. 4-1-752, మొజాంజాహి మార్కెట్, హైదరాబాద్-500001.

" శ్రీ బండి పరశురాములు—కలవపర్తి పోస్టు, మహబూబ్‌నగర్ జిల్లా.

" శ్రీ జాస్తి లక్ష్మీకృష్ణ శ్రీరంగనాయకులు—రాజుపాలెం (వయా) మార్టూరు, ప్రకాశంజిల్లా.

" శ్రీ సి. వి. సుబ్బారెడ్డి అడ్వొకేటు—పాపయ్యవీధి, కడప.

" శ్రీ డి. సాల్మన్—సియాన్‌పురం, కడప.

" శ్రీ కె. శంకరరెడ్డి—చిత్తూరు తాలూకా, చిత్తూరు జిల్లా.

" శ్రీ జి. జయసింహరెడ్డి—గూండ్లపల్లి, చిత్తూరు జిల్లా.

" శ్రీమతి నన్నపనేని రాజకుమారి—కృషిక్ నగర్, తెనాలి, గుంటూరు జిల్లా.

మరికొందరిని కో-ఆప్ట్ చేసికొనుటకు కార్యవర్గమునకు అధికారమున్నది.